# అమ్మా-యి

కార్తీకమాసం. బ్యాంకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు అంతా వనభోజనాని కెళ్ళారు.

కాఫీ, టిఫిన్లయ్యాక అంతా గ్రూపులుగా విడిపోయారు. కొందరు పిల్లలకీ ఆడవారికీ ఏవేవో పోటీలు నిర్వహిస్తోంటే మరి కొందరు చతుర్ముఖ పారాయణం మొదలెట్టారు. ఇంకొందరు చెట్టు మొదట్లో కూర్చుని బాతాఖానీలో పడ్డారు.

"రమణగారు పార్టీ బాకీ వున్నారు" శశిధర్ అన్నాడు.

"ఎందుకు?" అంటూ కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూశాడు రమణ.

"మూడోసారీ ఆడపిల్లే పుట్టినందుకు!"

అదేదో జోకైనట్టు ఘొల్లుమన్నారంతా. వరుస ఆడపిల్లల దెబ్బకి అసలే బెంగెట్టుకున్న రమణ మొఖం ఆ మాటలకి తెల్లబడి ఆపైన నల్లబడిపోయింది.

"మీరేం నవ్వక్కర్లేదు. చూస్తూండండి. మా పిల్లలు పెద్దవాళ్లయ్యేప్పటికి ఎదురు కట్నాలిచ్చే సంప్రదాయం వస్తుంది"

"అబ్బో-రమణగారు భలేగా ఆశలల్లుకుంటున్నారే" నవ్వేడు మునిరత్నం.

వెంటనే సూరి అందుకున్నాడు. "డోంట్ వర్రీ బ్రదర్. ఆడపిల్ల శ్రీమహాలక్ష్మి అనుకో. ఆడపిల్లలతో బాటు సిరులు నట్టింట ఘల్లుఘల్లుమని తిరుగుతాయి"

అది ప్రశంసో, ఎత్తి పొడుపో తెలీక మొఖాన గంటు పెట్టుకున్నాడు రమణ.

"ఇక్కడున్న అందరికన్నా లక్ష్మీ నరసింహంగారు అదృష్టవంతులు. ఆయనకి ముగ్గురూ మగపిల్లలే" రామశాస్త్రి అన్న మాటలకాయన చిన్నగా నవ్వి వూరుకున్నారు.

"నన్నడిగితే ప్రతివారికీ ఓ ఆడపిల్లా ఓ మగపిల్లాడూ వుండాలి. అప్పుడే ఆస్తులూ అప్పుల పట్టిక సరిపోతుంది" ఎక్కౌంటెంట్ మణి అన్నాడు.

"ఆహా! మణిగారు బ్యాలెన్స్‌షీటు భలేగా సరిపెట్టేస్తున్నారు. కాని అయ్యా ఒక్క సంగతి. అందరికీ అలా పుడితే గొడవేలేదు. మరి పుట్టకపోతే?" లా పాయింటు లేవనెత్తాడు చలం.

"పుడితే అదృష్టమని నా తాత్పర్యం" మణి వివరణ ఇచ్చాడు.

"ఇద్దరూ పుడితే మంచిదే. కాని ఎవరో ఒకరే అయినప్పుడు అబ్బాయి వుండటమే మంచిది. మన ఆస్తిపాస్తులూ కీర్తి ప్రతిష్ఠలూ పంచివ్వడానికీ, వంశం నిలవడానికీ వంశాంకురం లేకపోతే ఎలా?" శశిధర్ అన్నాడు.

"అదంతా పూర్వకాలపు సంగతి. ఇప్పుడెవరైనా ఒకటే. ఒకరి పెళ్ళికి ఖర్చు పెడతాం ఒకరి చదువుకి ఖర్చు పెడతాం. రెక్కలొచ్చి ఒకరూ పెళ్ళై మరోకరూ పక్షుల్లా ఎగిరిపోతారు" స్వానుభవాన్ని నెమరువేసుకున్నాడు మునిరత్నం.

"ఆ మాటకొస్తే ఆడపిల్లే నయమని గట్టిగా చెప్పగలను. ఎప్పుడెళ్ళినా ఎంతో ఆప్యాయంగా పలకరిస్తుంది. ప్రేమ కురిపిస్తుంది. పుట్టింటివారి క్షేమం కోసం అనుక్షణం తపిస్తుంది" రామశాస్త్రి అన్నాడు.

"వెళ్ళినప్పుడల్లా కాసుల మూట అందిస్తోంటే ఆడపిల్లేంటి కోడలుపిల్లకూడా ఆప్యాయత ఒలకబోస్తుంది. అంతా మనీ మహిమ బ్రదర్స్" బాషా అన్నాడు.

"పూర్వం వ్యవసాయం మీదా చేతివృత్తులమీదా అధికంగా ఆధారపడేవారు కదా. అందుకని మొదట కొడుకుపుట్టాలని కోరుకునేవారు. తండ్రికి వృత్తిలో సంపాదనలో చేదోడు వాదోడవుతాడని. తండ్రి తర్వాత తండ్రి బాధ్యతలు స్వీకరిస్తాడని. కొడుకు పుట్టాకే కూతురు కావాలనుకునేవారు. కూతురు తల్లికి ఆసరా వస్తుంది. తల్లిలా చిన్నవాళ్ళని లాలిస్తుంది. ఇప్పుడా బాధ్యతలూలేవు. ఆ బరువులు మోసేవాళ్ళూ లేరు. ఆనాటి విలువలూ లేవు!" వివరణాత్మక వ్యాఖ్యానం చేశారు పార్వతీశం.

"మరీ తీసి పారెయ్యకండి. ఎంతైనా కొడుకు పొజిషన్ కొడుకుదే. తలకొరివి పెట్టి పుణ్యగతులు కల్పించేది కొడుకేనండీ" శశిధర్ అందుకున్నాడు.

"ఏం కొడుకుల్లెద్దురూ. 'ఫాదర్ సీరియస్-స్టార్ట్ ఇమీడియట్లీ' అని టెలిగ్రాం వస్తే బక్కెట్ తన్నేశాడని నిర్ధారణ చేసుకుని గాని బస్సెక్కటం లేదీ నాటి కొడుకులు" రామశాస్త్రి అన్నమాటలకు మాటలకు చలం ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.

అంతవరకూ మౌనంగా వున్న లక్ష్మీనరసింహంగారు కల్పించుకున్నారు–"మీరందరూ తప్పే"

అంతా ఆశ్చర్యంగా చూశారాయన వంక. అక్కడున్నవారిలో అందరికన్నా పెద్దవారాయన. పైగా స్టేట్ బ్యాంక్ సీనియర్ మేనేజరు!

"అదేమిటండీ అలా అనేశారు" ముందుగా తేరుకున్న బాషా అన్నాడు.

"నా అనుభవంలోని ఓ సంఘటన చెబుతాను. రెండేళ్ళ క్రితం నా వైఫ్ చని పోయింది. నా ముగ్గురు కొడుకులూ కోడళ్ళూ, మనవలూ అంతా వచ్చారు. కొడుకులు లోలోన బాధపడుతూండిపోయారు. కోడళ్ళు రాని కన్నీళ్ళు తుడుచుకుంటూండి పోయారు.

అసలు మా ఇంట్లో శవం వుందన్న సంగతి చెబితే తప్ప పక్కింటివారిక్కూడా తెలీని దౌర్భాగ్యస్థితి.

ఒక్క ఆడనలుసూ లేనందుకు అప్పుడు నాకు దఃఖం పొంగి వచ్చింది. మాకో ఆడపిల్ల వుండి వుంటే అలాంటి దారుణస్థితి దాపురించేది కాదుకదా?!

సో. నేన్చెప్పేదేమిటంటే, మనం బ్రతికున్నప్పుడు మనకి ఆసరాగా వుండటానికో, చిన్న వాళ్ళకి చేయూత నివ్వడానికో కాకపోయినా కనీసం మనం చనిపోయినప్పుడు మన శవం మీద పడి భోరున విలపించడానికైనా ఒక్క ఆడపిల్ల తప్పకుండా వుండి తీరాలి....!"

ఆయన కంఠం రుద్ధమైంది. మిగతావారి గుండెలూ బరువెక్కాయి. ఆయన అనుభవపు పాఠాన్ని త్రోసిపుచ్చెయ్యగల సాహసం ఎవ్వరూ చేయలేకపోయారు!

**(స్వాతి వారపత్రిక 15.8.97)**